






సండే సందడి

పుస్తక పండుగకు పెరిగిన పాఠకులు

- ఇతర జిల్లాల నుంచి సందర్శకుల రాక
- కిక్కిరిసిన ప్రాంగణం

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవానికి పాఠకులు భారీగా తరలి వచ్చారు. ఆదివారం కావడంతో పుస్తక మహోత్సవ ప్రాంగణం పుస్తక ప్రియులతో సందడిగా కనిపించింది. విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచే కాకుండా ప్రకాశం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి సందర్శకులు వచ్చారు. పిల్లలకు కథల పుస్తకాలను, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను కొనుగోలు చేసిన తల్లిదండ్రులు వారికి ఆ ప్రాంగణంలోనే వాటిని చదివిస్తున్నారు. ఉపాధ్యాయులు వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చారు. కొంతమంది పాఠకులు మాత్రం ప్రసిద్ధి చెందిన పాత పుస్తకాల కోసం ప్రతి స్టాల్‌లో తిరుగుతున్నారు. ఈ మూడు రోజుల్లో పిల్లలకు సంబంధించిన కథల పుస్తకాలు ఎక్కువగా అమ్మకాలు సాగాయని ప్రచురణకర్తలు చెబుతున్నారు. **- ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్**

కొత్తకొత్తగా..



కొత్త ఏడాదికి బంటుమిల్లిలోని కొమ్మారెడ్డి పాఠశాలలో విద్యార్థుల వినూత్న స్వాగతం

కాలచక్రం గిర్రున తిరిగింది. చూస్తుండగానే 2023 కరిగిపోయింది. జిల్లాలోని వివిధ తరగతుల ప్రజలకు ఎన్నో అనుభవాలనిచ్చింది. కొన్ని గుణపాఠాలు నేర్పింది. కొన్ని సవాళ్లు విసిరింది. అడపాదడపా వినోదాలు పంచింది. విషాదాలూ నింపింది. ఇలా అన్నిరకాల అనుభూతులు ఇచ్చి కాలగర్భంలో కలిసిపోయింది. గతాన్ని గుర్తు చేసుకుంటూ.. కొత్త లక్ష్యాలు నిర్దేశించుకుంటూ.. ప్రతి ఒక్కరూ కొండంత బలంతో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆశిస్తూ 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుదాం.

అనుగృహం ఎప్పటికో!



బందరు మండలం రుద్రవరం వద్ద టిడ్కో గృహాలు

నాలుగేళ్లుగా టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల ఎదురుచూపులు

జిల్లాలో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించే ప్రక్రియ మూడడుగులు ముందుకు, ఆరు అడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించే ఈ గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక అంక్షలు పెడుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రివర్స్ టెండరింగ్ పేర్లతో ఈ గృహాల నిర్మాణాలను రెండేళ్లకుపైగా పనులను నిలిపివేశారు. లబ్ధిదారుల వివరాలు ట్యాంగింగ్, ఇతరత్రా సర్వేల పేరుతో నిర్మాణ పనులు చేయకుండా తీవ్రజాప్యం చేశారు. ఎట్టకేలకు రెండేళ్ల క్రితం టిడ్కో గృహాల నిర్మాణం ప్రారంభించినా ఈ సముదాయాల వద్ద మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సమకూరలేదు. గుడివాడలో 8,912 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించారు. మచిలీపట్నంలో గోసంఘం, రుద్రవరం, ఉయ్యూరు ప్రాంతాల్లో నిర్మాణం చేసిన, చేస్తున్న గృహాలను ఎప్పటికి లబ్ధిదారులకు అందిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 13,712 టిడ్కో గృహాల నిర్మాణ పనులను ఆరు సంవత్సరాల క్రితం ప్రారంభించారు. 300 చదరపు అడుగుల గృహాలు 3648... 365 చదరపు అడుగుల గృహాలు 2096... 430 చదరపు అడుగుల గృహాలు 7968 నిర్మించేలా లబ్ధిదారుల నుంచి నగదును కట్టించుకున్నారు. గుడివాడలోని టిడ్కో గృహాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ ఏడాది జూన్ 16వ తేదీన ప్రారంభించారు. అయినా ఇక్కడ ఇంకా పూర్తిస్థాయిలో వసతులు సమకూరలేదు. మచిలీపట్నం గోసంఘంలో టిడ్కో గృహాల నిర్మాణం పూర్తయినా వీటిని లబ్ధిదారులకు అందించకుండా నిలిపివేశారు. రుద్రవరంలో టిడ్కో గృహాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గోసంఘం, రుద్రవరంలలోని టిడ్కో గృహాలవద్ద ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తిచేయకుండా కాలయాపన చేస్తున్నారు. ఈ గృహ సమాదాయాలకు సంబంధించి బ్యాంకుల నుంచి లబ్ధిదారుల పేరున రుణాలు ఇప్పించేందుకు పలుమార్లు బ్యాంకు అధికారులతో కలెక్టర్ సమావేశాలు నిర్వహించారు. ఇటీవల కలెక్టర్. ఎమ్మెల్యే పేర్నినాని బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించి టిడ్కో

- జిల్లాలో **13,712** ఇళ్లు
- గృహ సముదాయాల వద్ద నత్తనడకన పనులు
- టిడ్కో గృహాలకు బ్యాంకు రుణాల మంజూరు అంతంతే

గృహాలకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఎంపీ వల్లభనేని రెండురోజులక్రితం విజయవాడలో టిడ్కో అధికారులతో సమావేశం నిర్వహించారు. టిడ్కో గృహాలకు లబ్ధిదారులు నగదు చెల్లించారని, అయినా గృహాలు ఇవ్వకుండా జాప్యంచేస్తున్నారని, గృహాలైనా ఇవ్వండి లేదా లబ్ధిదారుల చెల్లించిన నగదునైనా తిరిగి ఇచ్చివేయాలని చెప్పారు. లాటరీ పద్ధతిన లబ్ధిదారులకు కేటాయించిన ఈ గృహాలను లబ్ధిదారులకు అందించకుండా సాగదీత ధోరణితోనే వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వస్తే కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు టిడ్కో గృహాల పంపిణీ నిలిచిపోతుందనే భయం లబ్ధిదారులను వెంటాడుతోంది.

పనులు పూర్తయ్యేనా?

ఉయ్యూరులో, జెమిని స్కూల్, ఎగినపాడు రోడ్డు, గండిగుంట వద్ద 2496 టిడ్కోగృహాల నిర్మాణ పనులు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభించలేదు. జెమిని స్కూల్ సమీపంలోని టిడ్కో గృహాల నిర్మాణ పనులను 25 రోజులక్రితం ప్రారంభించారు ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియని స్థితి. మిగిలిన రెండు ప్రాంతాల్లో ఇంకా ప్రారంభించలేదు. మచిలీపట్నం మండలం రుద్రవరం వద్ద నిర్మాణంలో ఉన్న 1440 టిడ్కోగృహాల వద్ద పనులు చేస్తున్నా అవి నత్తనడకన సాగుతున్నాయి. రుద్రవరం వద్ద 3వేలకుపైగా గృహాలను నిర్మాణం చేసేందుకు గతంలో పునాదులు వేసినా వాటిలో 1460 గృహాల నిర్మాణాలను నిలిపివేశారు. లబ్ధిదారులకు మొండిచేయి చూపారు. రుద్రవరంలోని గృహసముదాయాల నిర్మాణం, రహదారులు, తాగునీటివసతి, ఇతరత్రా సౌకర్యాలు కల్పించేందుకు ఎంతసమయం పడుతుందో తెలియని స్థితి నెలకొంది. మచిలీపట్నం గోసంఘం వద్ద 864 గృహాలకు రంగులు వేసి, తాళాలు వేసి ఉంచారు.

మహిళలు కన్నెర్రజేస్తే ప్రభుత్వం కుప్పకూలుతుంది

కొనకళ్ల నారాయణ

- 8లో..

అలుపెరగని పోరు



అంగన్వాడీలు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. వేతనం పెంచే వరకు ఆందోళన విరమించేది లేదని బందరులోని ధర్నాచౌక్ వద్ద అంగన్వాడీలు నినాదాలు చేశారు.

రిజిస్ట్రేషన్ల కోలాహలం

కొత్త ఏడాది ముందే రుణ విముక్తి కోసం భారీగా మార్ట్‌గేజ్ రిలీజ్‌లు

- మూడు కార్యాలయాల్లో మార్ట్‌గేజ్ రిలీజ్‌ల సందడి
- పెళ్లి రిజిస్ట్రేషన్లు, గిఫ్ట్ డీడ్స్‌తో కార్యాలయాలు బిజీ
- గాంధీనగర్‌లో పోటెత్తిన సందర్శకులు
- 2 నుంచి 4 ఎంబీపీఎస్ స్పీడ్ పెరగడంతో పనులు వేగవంతం



గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కిటకిటలాడుతున్న సందర్శకుల దృశ్యాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నూతన సంవత్సరం రాబోతుండటంతో నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. పటమట, గాంధీనగర్, గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సందర్శకులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రధానంగా గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మూడు రోజులుగా రద్దీ నెలకొంటోంది. శనివారం కార్యాలయంలో రద్దీ పతాక స్థాయిలో ఉంది. గత మూడు రోజులుగా రాత్రుళ్లు ఎంత సమయం అయినా కూడా అధికారులు ఇక్కడే ఉండి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశాకే వెళుతున్నారు. కొత్త ఏడాది వచ్చేలోపే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ముగించుకోవాలన్న ఉద్దేశంతో పార్టీలంతా పెద్దసంఖ్యలో రావటంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈ సందడి నెలకొంది. సింహభాగం మార్ట్‌గేజ్ రిలీజ్‌లకు సంబంధించి అధిక భాగం డాక్యుమెంట్లు వస్తున్నాయి. నూతన సంవత్సరం నాటికి రుణ విముక్తులు కావాలన్న ఉద్దేశంతో మార్ట్‌గేజ్‌లను విడిపించుకోవటానికి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. నగరంలోని మూడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో బ్యాంకు ప్రతినిధులు, మార్ట్‌గేజ్ రిలీజ్ చేయించుకునే వారితో కోలాహలంగా ఉంది. గిఫ్ట్ డీడ్స్ కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఇవి కాకుండా అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా బాగానే వచ్చాయి. పెళ్లి రిజిస్ట్రేషన్లకు సంబంధించి కూడా గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎక్కువగా వస్తున్నారు. అన్ని కేటగిరీలకు సంబంధించి ఒక్కసారే రావటంతో.. అనూహ్యంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో రద్దీ ఏర్పడింది. ఎలాంటి సర్వర్ సమస్యలు లేకపోవటంతో సందర్శకులకు ఇబ్బందులు ఎదురుకాలేదు. ఇటీవల 2 ఎంబీపీఎస్ నుంచి 4 ఎంబీపీఎస్‌కు నెట్‌వర్క్ స్పీడ్‌ను పెంచటం వల్ల ఈ కేవైసీ, ఈ సైన్‌లు చేయటానికి గతంలో మాదిరిగా పెద్దగా సమయం తీసుకోవటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో సర్వర్ సమస్యలొస్తే తీవ్ర ఇబ్బందులు నెలకొనే అవకాశం ఉంది. అదృష్టవశాత్తూ అలాంటిదేమీ లేకపోవటంతో న్యూ ఇయర్ సందర్భంగా రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి.

సాహితీ సౌరభాలు..


జానీ

కృష్ణ నాయక్

బి.రవీంద్ర

తొలి సందర్శకులు..

విజయవాడ సిటీలైఫ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఒకరిది పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు. మరొకరిది తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం. ఇంకొకరిది ప్రకాశం జిల్లా మార్కాపురం. ముగ్గురి ప్రాంతాలు వేరయినా వృత్తి మాత్రం ఒక్కటే. పుస్తకాలతో నిత్యం సరస్వతీ నిలయంలో సహవాసం చేసే ఈ ముగ్గురు ఉపాధ్యాయులు తొలిసారిగి పుస్తక మహోత్సవానికి వచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన జానీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూనే గ్రూపు 2 పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను కొనుగోలు చేయడానికి స్నేహితులతో కలిసి ఆదివారం పుస్తక మహోత్సవానికి వచ్చాడు. ఇంతకుముందు హైదరాబాద్‌లో జరిగే బుక్ ఫెస్టివల్‌కు వెళ్లేవాడినని విజయవాడలో పుస్తక మహోత్సవానికి రావడం ఇదే తొలిసారి అని జానీ చెప్పారు. రాజమహేంద్రవరానికి చెందిన బి.రవీంద్ర ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పుస్తక మహోత్సవానికి వచ్చారు. ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి అని రవీంద్ర చెప్పారు. తిలక్, బుచ్చిబాబు, చలం, బాపు, రమణల సాహిత్యం తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన కృష్ణ నాయక్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు. ఎనిమిదేళ్ల వయస్సు నుంచే పుస్తక పఠనం ఒంటబట్టిందని ఆయన చెప్పారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతోపాటు ఆధ్యాత్మిక పుస్తకాలు, విప్లవాలకు సంబంధించిన పుస్తకాలు అంటే తనకు బాగా ఆసక్తి అని తెలిపారు. ఈ ముగ్గురు వారివారి పాఠశాలల్లో ప్రత్యేకంగా రీడింగ్ పిరియడ్లను పిల్లలకు ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో ఉన్న గ్రంథాలయంలో 400 - 500 వరకు చందమామ, బేతాళకథలు, పేదరాసి పెద్దమ్మ కథల పుస్తకాలు ఉన్నాయని, వారంలో రెండు సార్లు పిల్లలతో ఈ పుస్తకాలు చదివిస్తామని చెప్పారు.



నిలువెత్తు పాఠం..

విజయవాడ కల్చరల్ : నాగార్జున సాగర్ ఏపీ రెసిడెన్సియల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్గీయ వైవీ రెడ్డి వ్యక్తిగత, వృత్తి గత జీవితం రెండూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారందరికీ మార్గదర్శకమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 34వ పుస్తక మహోత్సవం నాలుగో రోజు ఆదివారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదిక నాగార్జున సాగర్ ఏపీ రెసిడెన్సియల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్గీయ వైవీ రెడ్డి స్మృతి సంచిక 'నిలువెత్తు పాఠం' పుస్తకాన్ని ఐఏఎస్ అధికారి మహ్మద్ ఇంతియాజ్ ఆవిష్కరించారు. లయోలా కళాశాల అధ్యాపకులు మొవ్వా శ్రీనివాసరెడ్డి, కుటుంబసభ్యులు బ్రిగేడియర్ వెంకటరెడ్డి తదితరులు మాట్లాడారు.

ఏ రచయిత ఏ పుస్తకం రాసినా.. ఎవరు ఏ నాటిక రాసినా.. దానికి ఒక గుర్తింపు రావాలనుకుంటారు. 'స్థానిక' గుర్తింపు కంటే కేంద్ర గుర్తింపును రచయితలు కోరుకుంటారు. ఇలా అనేక మంది రచయితలను, రచనలను కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తించింది. కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపు పొందిన ఉత్తమ రచనలకు సంబంధించిన పుస్తకాలు పుస్తక మహోత్సవంలో కొలువయ్యాయి. కేంద్ర సాహిత్య అకాడమీ బెంగళూరు శాఖకు చెందిన స్టాల్ ఏడులో ఉంది. కన్నడ - తెలుగు నిఘంటువు, శవాలను మోసేవాడి కథ, తెలుగు గిరిజన సాహిత్యం, అంతఃపురం, భారతీయ భాషా కథలు, పాకిస్తాన్ కథలు, ఆకాశం నా వశంతోపాలు అనేక పుస్తకాలకు కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపును ఇచ్చింది. తెలుగులో ముద్రణ అయిన పుస్తకాలు, తెలుగు అనువాద పుస్తకాలు ఈ స్టాల్‌లో ఉన్నాయి. సీనియర్ సిటిజన్లు ఈ పుస్తకాలను కొనుగోలు చేయడానికి ఆసక్తిని చూపిస్తున్నారు.



న్యాయ రూపాలు

ఒక్కో కేసుకు ఒక్కో చట్టం. ఒక్కో చట్టానికి ఒక్కో పుస్తకం. న్యాయస్థానాలు, అందులో దాఖలయ్యే పిటిషన్లకు వర్తించే సెక్షన్లు, నేరాల విచారణకు సంబంధించిన పుస్తకాలను కొనుగోలు చేయడానికి యువ న్యాయవాదులు ఆసక్తిని చూపిస్తున్నారు. పుస్తక మహోత్సవంలో స్టాల్ నంబర్ 22లో సుప్రీం లా హౌస్‌లో న్యాయస్థానాలకు, కేసులు, చట్టాలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి. వివాహం, విడాకుల చట్టం, మహిళా వివాదాలు, కట్నం నిషేధ చట్టం 1961, ఏపీ భూసంస్కరణల చట్టం, ఏపీ అపార్ట్‌మెంట్ల చట్టం, కోర్టు ఫీజులు, మేధో సంపత్తి చట్టం, నేర విచారణ ప్రక్రియ స్మృతితోపాటు వివిధ చట్టాలకు చెందిన పుస్తకాలను ప్రదర్శనలో ఉన్నాయి. న్యాయవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, న్యాయవాద వృత్తిలోకి కొత్తగా అడుగు పెట్టిన యువన్యాయవాదులు ఈ పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు.



పసలపూడి అక్షరాలు

అక్షరాల్లో ప్రకృతిని, పల్లెవాతావరణాన్ని ప్రతిబింబించే రచయిత వంశీ. ఆయన స్వగ్రామం కోనసీమ జిల్లా పసలపూడి పేరుతో అనేక పుస్తకాలు రాశారు. పసలపూడి కథల పేరుతో వంశీ రాసిన పుస్తకాలు పాఠక లోకాన్ని ఆకట్టుకున్నాయి. వంశీ కలం నుంచి జాలువారిన రచనల పుస్తకాలు పుస్తక మహోత్సవంలో ప్రత్యేకార్షణగా ఉన్నాయి. స్టాల్ నంబర్ 90లో ఉన్న ఎమెస్కో ప్రచురణ సంస్థలో వంశీ రాసిన మన్యంరాణి, ఆకుపచ్చని జ్ఞాపకం, వంశీకి నచ్చిన కథలు, పసలపూడి కథలు, ఏవో... కొన్ని గుర్తుకొస్తున్నాయి, మా దిగువ గోదావరి కథలు, గోకులంలో రాధా, మంచుపల్లకి, పొలమారిన జ్ఞాపకాలు పుస్తకాలను సినిమా ప్రియులు పరిశీలిస్తున్నారు.



(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్)

సమాజ మార్పు కోసమే సాహిత్యం, కళలు..

విజయవాడ కల్చరల్, డిసెంబరు 31 : సమాజ మార్పు కోసమే సాహిత్యం, కళలు అని, సమాజం నుంచి స్ఫూర్తిపొందిన కవిత్వమే సమాజాన్ని కదల్చగలుగుతుందని పాత్రికేయుడు కవి జాలూరు గౌరీశంకర్ చెప్పారు. 34వ పుస్తక మహోత్సవంలో నాలుగో రోజు ఆదివారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై 'జాలూరు పథం' పేరుతో పాత్రికేయుడు జాలూరు గౌరీశంకర్ రాసిన దీర్ఘ కవిత పుస్తకాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత్వంపై సాహిత్యం యొక్క, సమాజం యొక్క ప్రభావాన్ని గురించి నారాయణ, గౌరీ శంకర్‌లు ముఖాముఖీ చర్చ నిర్వహించారు. సమాజంలో చైతన్యాన్ని కవులు అందంగా ప్రభావవంతంగా ప్రతిఫలించి మరో పదిమందికి చేరుస్తారని ఆయన వివరించారు. కవులు, సాహిత్యకారులు సమాజంలో మార్పుకు స్ఫూర్తినిస్తూ, సమాజ పరిమాణంలో వివిధ దశలకు దోహదం చేస్తారని చెప్పారు. కళ కళకోసం మాత్రమే వుంటే అది ప్రజల మెప్పు పొందలేదని ఆయన అభిప్రాయపడ్డారు. కళ ప్రజల కోసం వ్యక్తీకరించబడి, ప్రజల మెప్పు పొందలేవన్నారు. తెలంగాణా ఉద్యమం లాంటి అనేక ఉద్యమాలు సఫలం కావడానికి సంగీత సాహిత్యాలు ఎంతో దోహదం చేశాయన్నారు. బిగ్‌బాస్ కార్యక్రమం కుటుంబసమేతంగా చూస్తున్నప్పుడు, నాగార్జున మాటలు ఆకర్షణీయమైనపుడు, వాటికి చప్పట్లు కొట్టే సమాజం వున్నపుడు, సమాజం అంతా ప్రశ్నించుకోవాల్సిన ఆవశ్యకత వుందన్నారు. సామాజిక స్పృహతో ఎలా దాన్ని తిప్పి కొట్టాలి అనేది సాహిత్యమా.. కళలు, న్యాయపరమైన విధానమా అనేది చూడాలన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం తర్వాత నీటి విషయంలోను, స్వేచ్ఛ విషయంలోను చాలా సానుకూలత వచ్చిందన్నారు. తెలంగాణలో దళిత పాలన రావాల్సిన అవసరం వుందన్నారు. దళితుల్ని తెలంగాణలో గేట్ల వరకే రానిస్తున్నారని, ఇండ్లలోకి ఆహ్వానించే సంప్రదాయం రావాలన్నారు. అన్ని విధాల అభివృద్ధి కోసం తెలంగాణ గళం కలం కొనసాగుతూనే వుంటుదన్నారు. ఈ సభకు అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించారు. విశాలాంధ్ర పబ్లికేషన్స్ మేనేజర్ మనోహర నాయుడు పాల్గొన్నారు.


జాలూరు పథం ఆవిష్కరిస్తున్న సీపీఐ నారాయణ


మరో కుంతి పుస్తకాన్ని జేడీ లక్ష్మీనారాయణకు అందిస్తున్న ఐఏఎస్ అధికారి ఇంతియాజ్, వెన్నా వల్లభరావు తదితరులు

అనువాదం.. ఒక వరం

విజయవాడ కల్చరల్, డిసెంబరు 31 : మూల భాషలో చదువుకోలేని వారికి అనువాదాలు ఒక వరమని ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అన్నారు. 34వ పుస్తక మహోత్సవంలో ఆదివారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై డాక్టర్ వెన్నా వల్లభరావు రాసిన మరో కుంతి కథా సంపుటాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనాటి సమాజంలో ప్రతిబింబించే కథలన్నీ కూడా ఈ మరో కుంతీ సంపుటంలో చేర్చారన్నారు. సంపుటంలో ఉన్న కథల విశిష్టలను గుమ్మా సాంబశివరావు మట్లాడుతూ, వెన్నా వల్లభవారు అనువాదాన్ని అలవోకగా రాయకుండా మూల రచయిత చెప్పిన భావానికి తగినట్టు తెలుగు పదాలను ఏ విధంగా ప్రయోగిస్తే బాగుంటాయో ఆ శైలిని వినియోగించడం ఆయన ప్రత్యేక అనువాద మార్గమన్నారు. తెలుగు పలుకుబడిను జాగ్రత్తగా మేళవిస్తూ అనువాదం చేయడంలో ప్రావీణ్యత వుందన్నారు. దాని వల్ల పట్టణావళి అధికంగా పెరుగుతుందన్నారు. పాటిబండ్ల రజిని వివరిస్తూ అనువాదకుడి సామర్థ్యాన్ని ప్రశంసించారు. పురాణకాలం నుంచి ఆధునిక కాలం వరకు స్త్రీలు విషాద జీవితాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంపుటంలోని సామాన్య మానవులలోని విభిన్న కోణాలను హృద్యంగా చర్చించారని వివరించారు. డాక్టర్ కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు, సాహితీ పోషకులు గోళ్ల నారాయణరావు సభకు అధ్యక్షత వహించారు. తొలి పుస్తకాన్ని మాజీ సీబీఐ అధికారి లక్ష్మీనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో చింతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెలుగు కథాలోకంలో కారా స్థానం సుస్థిరం

తెలుగు సాహిత్యంలో నిజాయితీతో కూడిన రచయిన కాళీపట్నం రామారావు (కారా) అని వక్తలు అన్నారు. ఆదివారం కేతు విశ్వనాథ రెడ్డి సాహిత్య వేదికపై కాళీపట్నం రామారావు శతజయంతి సభ నిర్వహించారు. సభలో ప్రధాన వక్తగా కాళీపట్నం రామారావు శిష్యుడు సన్నిహితుడు అట్టాడ అప్పలనాయుడు మాట్లాడారు. కారా మాస్టారి కథలు పాఠకులకు తమ చుట్టూ వున్న సమాజాన్ని లోతుగా అర్థం చేసుకొనే శక్తిని కల్పిస్తాయన్నారు. సామాజిక, ఆర్థిక న్యాయాలకు సబంధించిన మౌలిక సూత్రాలను తన కథలలో అంత ర్లీనంగా పొదగడం ఆయన గొప్పదనమన్నారు. కథా నిలయం స్థాపకులుగా కాళీపట్నం రామారావు తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానం సంపాదించారని అరసం అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ చెప్పారు. విశాలాంధ్ర పబ్లికేషన్స్ మేనేజర్ మనోహరనాయుడు పాల్గొన్నారు.

- కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై విశాలాంధ్ర పబ్లిషర్స్ వారు 'వివృత' పేరుతో ప్రచురించిన కథా విమర్శ వ్యాసాల సంపుటిని మురహరి నాగరాజకుమార్ ఆవిష్కరించారు. కథా రచయితలు కూనపరాజు కుమార్, అజయప్రసాద్, కాకుమాని శ్రీనివాసరావులు ప్రసంగించారు.

పుస్తక మహోత్సవ పాదయాత్ర నేడు

పుస్తక మహోత్సవంలో ఐదో రోజు సోమవారం పుస్తక ప్రియుల పాదయాత్ర నిర్వహిస్తారు. సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల వద్ద పాదయాత్రకు జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పచ్చజెండా ఊపుతారు. సంపాదకులు వర్దెల్లి మురళి నాయకత్వం వహిస్తారు. పాదయాత్ర 5 నెంబరు రోడ్డుమీదుగా పుస్తక ప్రాంగణానికి చేరుకుంటుంది. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొంటారు.



భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదుల నిరసన దీక్ష

న్యాయవాదులు ఉద్యమం విరమించలేదు

» బెజవాడ బార్ అధ్యక్షుడు కేజీ సుందర్

విజయవాడ లీగల్, డిసెంబరు 31 : ఏపీ భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు 11 రోజులుగా చేస్తున్న దీక్షలను విరమించినట్టుగా ప్రభుత్వానికి చెందిన ఒక పత్రికలో (ఆంధ్రజ్యోతి కాదు) వచ్చిన వార్తను ఆదివారం ఆయన ఖండించారు. శనివారం న్యాయవాదుల జేఏసీ అధ్వర్యంలో సీఎంవో అధికారికి న్యాయవాదులు వినతిపత్రం సమర్పించారని, దానికి ఆయన సీఎంతో మాట్లాడి చట్టం వలన కలిగే నష్టాలను తెలియజేస్తామని చెప్పారన్నారు. దీనికి న్యాయవాదులు దీక్ష విరమించినట్టు తప్పుడు కథనం ప్రచురించడం జరిగిందని, దీనిని న్యాయవాదులంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నట్టు సుందర్ తెలిపారు. 2024 జనవరి 5వ తేదీ వరకు దీక్షలు కొనసాగుతాయని, అనంతరం న్యాయవాదులతో చర్చించి నిర్ణయం తెలియజేస్తామన్నారు. ఏపీ భూ హక్కు చట్టం-2022కు వ్యతిరేకంగా బెజవాడ బార్ న్యాయవాదుల నిరసన దీక్షలు ఆదివారం 11వ రోజు కొనసాగాయి. దీక్షలో న్యాయవాదులు ఎ.ఎస్.ఎస్. రాంప్రసాద్, వీఎస్‌వీ రాజ్యలక్ష్మి, బి.పుష్పకుమారి, కె.జయశ్రీ, ఎన్.యోనాతాన్, సీహెచ్. వీర్రాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో బెజవాడ బార్ ఉపాధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జన్ను శ్రీధర్, మాజీ ప్రధాన కార్యదర్శి గంధం శ్రీనివాసరావు, కండెల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి బహిరంగ చర్చకు రావాలి

» పోతిన వెంకట మహేశ్



వన్‌టౌన్, డిసెంబరు 31 : ముఖ్యమంత్రి జగన్, మంత్రి జోగి రమేశ్‌లు బహిరంగ చర్చకు రావాలని జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతిన వెంకట మహేశ్ సవాల్ విసిరారు. ఆదివా రం వన్‌టౌన్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి జోగి రమేశ్ మీడియా సమావేశంలో పవన్‌కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం సెంటు భూమి ఇళ్ల పథకం పేరుతో రూ.35వేలకోట్లు మేర భారీ కుంభకోణం చేశారని, సీబీఐ, ఈడీల చేత విచారణ జరిపించాలని పవన్‌కల్యాణ్ శనివారం ప్రధానమంత్రికి లేఖ రాశారన్నారు. దీంతో జగన్‌కు, జోగి రమేశ్‌కు వెన్నులో వణుకు పుట్టి నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. వాళ్ల కోరుతున్నట్టుగానే బహిరంగ చర్చకు తాను సిద్ధమని మహేశ్ పేర్కొన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌కు రావడానికి కూడా సిద్ధమేనన్నారు. బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. దమ్ముంటే తమ సవాల్‌ను స్వీకరించాలన్నారు. కేంద్రం నుంచి ఇళ్ల కోసం 14,360 కోట్లు రాగా 11,358 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మిగతా డబ్బులు కొట్టేశారని ఆరోపించారు. పవన్ కల్యాణ్ చెప్పింది నిజం కాదని, చెప్పే ధైర్యం, దమ్ము ఉన్నాయా అంటూ నిలదీశారు. జోగి రమేశ్ జక్కంపూడి వస్తే ఇళ్ల విషయంలో జరిగిందేమిటో చెబుతామని, జోగి వల్లే వసంతకృష్ణ ప్రసాద్ పార్టీకి దూరంగా ఉన్నారని చెప్పారు.

తిరుపతమ్మ ఆలయంకు డీసీ స్థాయికి కుదింపు

పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ తల్లి దేవస్థానాన్ని ఆదాయం తగ్గిన నేపథ్యంలో ఆర్‌జేసీ స్థాయి నుంచి డీసీ స్థాయికి తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఆర్.కరికాల్ వలవేన్ గెజిట్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలో ఆదాయం తగ్గిన పలు ఆలయాల స్థాయి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంలో తిరుపతమ్మ ఆలయం కూడా ఉంది. ఇదిలా ఉంటే అమ్మవారి ఆలయ ఆదాయం ఆర్‌జేసీ స్థాయికి ఉన్నప్పటికీ డీసీస్థాయి తగ్గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం పట్ల పలువురు భక్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతమ్మకు విరాళాలు

తిరుపతమ్మ అమ్మవారికి గుంటుపల్లి గ్రామానికి చెందిన పెదర్ల శ్రీనివాసరావు - రాజేశ్వరి దంపతులు 12 గ్రాముల బంగారు గాజులను ఏఈవో తిరుమలేశ్వరరావుకు ఆదివారం అందజేశారు. జగ్గయ్యపేట గౌరవరానికి చెందిన కొలికినేని దేశయ్య - సీతారత్నం దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.30 వేలు, మండడపు శ్రీకాంత్ - త్రివేణి దంపతులు గో సంరక్షణకు రూ.10 వేలు ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్‌కు అందజేశారు.

తాడోపేడో తేల్చుకుంటాం..

» 20వ రోజుకు అంగన్వాడీల సమ్మె

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 31 : రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని, 20 రోజులుగా సమ్మె చేస్తున్నా సమస్యలు పరిష్కరించని ప్రభుత్వంతో తాడేపేడో తేల్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సంఘ జిల్లా అధ్యక్షురాలు ఎ.రమాదేవి అన్నారు. మచిలీపట్నం ధర్నాచౌక్ వద్ద ఆదివారం నాటికి అంగన్వాడీల సమ్మె 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ, బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు పడుతున్న అవస్థలపై ప్రభుత్వం కనీసం దృష్టి సారించడం లేదన్నారు. మచిలీపట్నం ప్రాజెక్టు సంఘ ప్రధాన కార్యదర్శి రెజీనారాణి మాట్లాడుతూ, న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుబ్రహ్మణ్యం, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరు శోచనీయం..

విజయవాడ (ధర్నాచౌక్) : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నాచౌక్‌లో ధర్నా శనివారం 20వ రోజు కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రతిపక్ష నేతగా సీఎం జగన్ తమకిచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల పట్ల ప్రభుత్వ నిరంకుశ వైఖరి మార్చుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధిక సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి

కొనసాగిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

మచిలీపట్నం టౌన్ : ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనాలు కల్పించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ నాయకులు పోతురాజు డిమాండ్ చేశారు. ధర్నాచౌక్ వద్ద ఆదివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరాహార దీక్షల్లో పాల్గొన్నారు. దీక్షలకు పలు ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.


నిరాహార దీక్షలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

మున్సిపల్ కార్మికుల దీక్ష భగ్నం

» సీఐటీయూ నేత అరెస్టు.. ఆసుపత్రిలో చేరిక

» మాట తప్పిన సీఎం: మాజీమంత్రి ఉమా



ఇబ్రహీంపట్నం, డిసెంబరు 31 : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కొండపల్లిలో చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద మున్సిపల్ కార్మికుల నిరసన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఆదివారం పోలీసులు సీఐటీయూ నేత ఎం.మహేశ్, మున్సిపల్ కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈక్రమంలో తీవ్ర అస్వస్థతకు గురైన మహేశ్‌ను కొండపల్లిలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. మహేశ్‌ను మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పరామర్శించారు. అనంతరం కార్మికులకు సంఘీభావం తెలిపారు. కొండపల్లి మున్సిపాలిటీలో వైసీపీ నాయకులు రూ.10 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఇందుకు సీఎం జగన్, మైలవరం ఎమ్మెల్యే వసంత బాధ్యత వహించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహేశ్‌ను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావు పరామర్శించారు. న్యాయమైన కోర్కెల కోసం నిరసన చేస్తున్న కార్మికులపై, పోలీసులు భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. సీపీఎం నాయకులు మధు, పీవీ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ అమ్మాజీలు మహేశ్‌ను పరార్శించారు.


కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న బొమ్మసాని సుబ్బారావు

మహిళలు కన్నెర్ర జేస్తే ప్రభుత్వం కుప్పకూలుతుంది

» కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 31 : తెలుగు మహిళలు కన్నెర్ర చేస్తే జగన్‌రెడ్డి ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో కుప్ప కూలిపోతుందని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, టీడీపీ కృష్ణాజిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అన్నారు. మచిలీపట్నం టీడీపీ పార్లమెంటు కార్యాలయం వద్ద జిల్లాస్థాయి తెలుగు మహిళల సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వివిధ మండలాల తెలుగు మహిళలు తరలివచ్చారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, జనవరి మూడోవారంలో ఐదు వేలమంది తెలుగు మహిళలతో జిల్లాస్థాయిలో ర్యాలీ నిర్వహించాలన్నారు. నియోజకవర్గ, మండలస్థాయిలో తెలుగు మహిళలు సమావేశాలు నిర్వహించాలన్నారు. తెలుగు మహిళ టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత మాట్లాడుతూ, ఇటీవల జిల్లాలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై నిరసన ప్రదర్శనలు నిర్వహించడంలో జిల్లా అగ్రగామిగా ఉందన్నారు. పలువురు తెలుగు మహిళలపై వివిధ మండలాల్లో పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. చంద్రబాబును అధికారంలోకి తెచ్చేందుకు తెలుగు మహిళలు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు, రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి శాయన పుష్పవతి, ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి, రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, జిల్లా తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, ఉపాధ్యక్షురాలు సుధారాణి, పొట్లూరి జ్యోతి, జిల్లా అధికార ప్రతినిధి పాలపర్తి పద్మజ, మైనేని ఇందిర, మల్లంపాటి విజయలక్ష్మి, లంకిశెట్టి నీరజ, బండె కనకదుర్గ, మేడేపల్లి రమాదేవి, తూము పద్మజ, దేవరపల్లి అనిత, వసంతకుమారి, పొట్లూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కొనకళ్ల నారాయణ, తెలుగు మహిళలు

నిశ్శబ్ద విప్లవం బహిరంగమవుతోంది

ఇప్పటివరకు జగన్‌రెడ్డిపై నిశ్శబ్దంగా ఉన్న విప్లవం బహిరంగమవుతోందని, రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం తుడిచిపెట్టుకు పోవడం ఖాయమని కొనకళ్ల నారాయణ అన్నారు. కొనకళ్ల నారాయణ, కొనకళ్ల బుల్లయ్యలను ఉయ్యూరు మునిసిపల్ మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు కలిసారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలపై వారితో కొనకళ్ల నారాయణ చర్చించారు.

మహిళా శిశు సంక్షేమశాఖలో పోస్టులకు

దరఖాస్తుల ఆహ్వానం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, డిసెంబరు 31 : జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ-ఐసీపీఎస్, శిశుగృహ, బాలసదన్‌లో కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్/పార్ట్‌టైం పద్ధతిపై పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుల భర్తీకి సంబంధించి 2023, నవంబరు 7న ఇచ్చిన నోటిఫికేషన్‌లో వయసుకు సంబంధించి మార్పులు చేసినట్టు తెలిపారు. 18 నుంచి 42 ఏళ్లలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, వికలాంగులకు 10 ఏళ్లు సడలింపు వుంటుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా స్థానిక అభ్యర్థులు ఎన్‌టీఆర్.ఏపీ.జీఓవీ.ఇన్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తుకు గెజిటెడ్ అధికారి అటెస్ట్ చేసిన ధృవీకరణ పత్రాలను జతచేసి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి వారి కార్యాలయం, డోరు నెం.6-93, కార్మెల్ చర్చి ఎదురు రోడ్డు, కానూరు, విజయవాడ కార్యాలయము నందు జనవరి 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

శుభాకాంక్షలకు పుస్తకాలు, పెన్నులతో రండి

నూతన సంవత్సరం సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే అధికారులు, ఉద్యోగులు, ఆత్మీయులు, సన్నిహితులు బొకేలు, పుష్పగుచ్చాలు, శాలువాలకు బదులు నోట్ పుస్తకాలు, పెన్నులు వంటివి తీసుకురావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నోట్ పుస్తకాలు, పెన్నులు వంటి చిరుకానుకలు పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడతాయని, పుష్పాలు, పండ్లు ఒక్కరోజుతోనే నిరుపయోగమవుతాయని, ఒక పుస్తకం పేద విద్యార్థుల జీవితంలో విద్యావెలుగులు నింపుతుందని అలాంటి గొప్ప కార్యక్రమంలో మీరు కూడా భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. మీరిచ్చే పెన్నులు, పుస్తకాలు పేద విద్యార్థులకు అందించడం జరుగుతుందని, వారి కృతజ్ఞతలు, ఆశీస్సులు మీపై ఎప్పటికీ వుంటాయని పేర్కొన్నారు.

నేటి స్పందన రద్దు

కృష్ణలంక, డిసెంబరు 31 : జనవరి 1వ తేదీ సోమవారం జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా విజయవాడలోని కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు వెల్లడించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ కోరారు.

వైసీపీకి బొమ్మసాని చలపతి రాజీనామా

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 31 : మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఒంటెత్తు పోకడ కారణంగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఇబ్రహీంపట్నం మండల వైసీపీ మాజీ అధ్యక్షుడు బొమ్మసాని చలపతి రావు ప్రకటించారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, పార్టీ కార్యాలయాన్ని సొంత ఎస్టేట్‌గా మార్చి ఇన్‌చార్జిలను సూపర్‌వైజర్లుగా నాయకులు, కార్యకర్తలను స్వీపర్లుగా ఎమ్మెల్యే మార్చాడని దుయ్యబట్టారు. వీటీపీఎస్ కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు.

జాబ్‌మేళా 4న

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 31: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో జనవరి 4న మచిలీపట్నం బైపాస్ రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాస్ తెలిపారు. 18- 22 వయస్సు ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. వివరాలకు 9966489796కు లో సంప్రదించాలన్నారు.



పేద విద్యార్థినులకు నిత్యావసర వస్తువులు, నగదు అందజేస్తున్న మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు

బాలికలు విద్యావంతులైతేనే దేశాభివృద్ధి

● మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం టౌన్ , డిసెంబరు 31 : బాలికలు విద్యావంతులైతేనే దేశాభివృద్ధి జరుగుతుందని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పరాసు పేటలోని ఉచిత బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు బచ్చుల బోసుబాబు, మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షుడు వేణుకుమార్ నిత్యావసర వస్తువులు అందజేశారు. స్టార్ కళాశాల కరస్పాండెంట్ శ్రీరాం పేద విద్యార్థులకు రూ.10 వేలు పరీక్ష ఫీజు అందజేశారు. జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి శంకరరావు సబ్బులు, గ్లౌజులు, మాస్కులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు సాయికృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశం కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, పేద బాలికలకు ఉచిత భోజన వసతి సదుపాయాలు, విద్యా బుద్ధులు కల్పించడం అభినందనీయమన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, తనకున్న దానిలో పేద విద్యార్థులకు దాతలు కొంత సాయం అందించేందుకు ముందుకు రావాలన్నారు. ప్రవాసాంధ్రుడు , ప్రముఖ విద్యావేత్త దిట్టకవి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యతోనే విజయాలు సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తొమ్మిదో డివిజన్ కార్పొరేటర్ రాసంశెట్టి శ్రీవాణి, డాక్టర్ బృందావనం శ్రీనివాసాచార్యులు, పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనుపమ, పద్మావతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తలశిల దామోదర్ , సంస్థ చైర్మన్ ఉల్లి రంగారావు,కె.రాజేంద్రప్రసాద్ , పి.వి. ఫణికుమార్, కాపవరపు చంద్రశేఖర్, సత్యనారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు. దిట్టకవి శ్రీనివాసరావును కొనకళ్ల నారాయణరావు ,తదితరులు ఘనంగా సత్కరించారు.



ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ విజయ్

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 31 : మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆదివారం ఈడేపల్లిలోని సత్యసాయి మందిరంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ విజయ్, సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్, డి. సాయి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



చిన్నాపురంలో అయోధ్య అక్షితలు పంపిణీ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 31 : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం అయోధ్య రామాలయం నుంచి తీసుకుని వచ్చిన శ్రీరాముల వారి తలంబ్రాలను బందరు మండలం చిన్నాపురం గ్రామంలో ఊరేగించారు. ప్రజలకు పంపిణీ చేశారు. ఈ నగరోత్సవంలో గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు 2024

హామీల అమలులో జగన్ విఫలం

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ధ్వజం

పెనమలూరు, డిసెంబరు 31 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు విషయంలో 85శాతం హామీలను అమలుపరచకుండా జగన్‌రెడ్డి ఘోరంగా విఫలమయ్యాడని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ధ్వజమెత్తారు. ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సైకో జగన్ ప్రజా వ్యతిరేక పాలనపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావేదికతో ప్రారంభమైన కూల్చివేతల ధోరణి రుషికొండ నాశనంతో ఇప్పటికీ కొనసాగుతోందని ప్రజలకు గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఏదోవిధంగా గద్దెనెక్కేందుకు అలివిమాలిన హామీలిచ్చిన జగన్‌రెడ్డి హామీలను అమలు పరిచేందుకు ఆపసోపాలు పడుతున్నాడని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం రోజున విద్యుత్ బిల్లులు పెంచం అని హామీ ఇచ్చి మాట తప్పి కరెంటు ఛార్జీలు పెంచాడని విమర్శించారు. మద్య నిషేధం దశల వారీగా అమలు పరిచి ఎన్నికలకు వస్తానని రాష్ట్ర మహిళలకు హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి మద్యం మీదే ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతున్నాడని ఎద్దేవా చేశారు. సీపీఎస్ రద్దు, ప్రమాదవ శాత్తూ చనిపోయిన వ్యక్తుల కుటుంబాలకు ఐదు లక్షల పరిహారం, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతపై పలు హామీలు గుప్పించి గద్దెనెక్కిన సైకో హామీల అమలులో మీనమేషాలు లెక్కిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులను ఉద్ధరిస్తానని ఇచ్చిన హామీలను మరిచాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాడిగడప

రామరాజ్యం రావాలి

పునాదిపాడు : రానున్న నూతన సంవత్సరంలో రామరాజ్యం రావాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని పునాదిపాడులో తెలుగుదేశం, జనసేన పార్టీలు సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ముందస్తు నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరుగుతుం దన్నారు. జగనాసురుడు రాజ్యం పోయి రామరాజ్యం వస్తుందన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీ ఉమ్మడిగా రాష్ట్రంలో అధికారం చేపడతారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాసరనేని కరుణ, కర్రా కిషోర్ బాబు, మునుబోయిన బాబు, సీహెచ్ రాజేష్, ఎం. రవి, కె. నరేష్, ఎం. మాధవ, బుజ్జి, రమణ, ఖాళి పాల్గొన్నారు.



న్యూ ఇయర్ కేకు కట్ చేస్తున్న బోడె ప్రసాద్

టీడీపీతోనే బీసీల సాధికారత

ఓగిరాలలో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 31 : వెనుకబడిన తరగతుల వారికి రాజకీయ సాధికారికత కోసం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన ఘనత టీడీపీదేనని గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఓగిరాలలో శనివారం రాత్రి గ్రామ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. బీసీల అభ్యున్నతికి చంద్రబాబు నాయుడు హయాంలో సబ్‌ప్లాన్ ద్వారా దాదాపు రూ. 40వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్లను 10 శాతానికి కుదించడంతో పాటు వివిధ పథకాలను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు ప్రకటించిన మ్యానిఫెస్టోలో బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. బీసీల ఉన్నతికి రాజకీయ సాధికారికతకు టీడీపీ పునరంకితమవుతందన్నారు. గ్రామంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించే విధంగా పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఏర్పాటుకు కృషి చేసిన మేడికొండ సోంబాబును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, సజ్జా చలమారావు, కగ్గా గని, మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, మూల్పూరి సాయికళ్యాణి, ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, కొండపావులూరి నాని, బేతాశేషుకుమార్, తుమ్మల బ్రహ్మజీ, జనసేన మండల అధ్యక్షుడు వడ్డి శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న యార్లగడ్డ

మైనేని దంపతుల జీవితం ఆదర్శనీయం

సీపీఐ నేతలు నారాయణ, రామకృష్ణ



మైనేని జయప్రద చిత్రపటం వద్ద నేతల నివాళి

పెనమలూరు, డిసెంబరు 31 : కంకిపాడు నియోజకవర్గానికి రెండు దఫాలుగా సీపీఐ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల కోసం పాటుబడి అమరులైన మైనేని లక్ష్మణస్వామి జీవితం అందరికీ ఆదర్శనీయమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణలు పేర్కొన్నారు. ఇటీవల మృతిచెందిన ప్రముఖ విద్యావేత్త లక్ష్మణస్వామి సతీమణి జయప్రద సంస్మరణ సభ ఆదివారం కానూరులో నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ, విశాలాంధ్ర పూర్వ సంపాదకులు నాగేశ్వరరావు, మోతుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపానికి నిధులు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 31: స్థానిక గుడివాడ రోడ్డులో నిర్మాణం చేపట్టిన కాపు కల్యాణ మండపానికి ఎంపీ వల్లభనేని బాలశౌరి మరో రూ.25 లక్షలు మంజూరు చేశారు. గతంలో కాపు కల్యాణ మండపానికి ఎంపీ నిధులు నుంచి రూ.25లక్షలు మంజూరు చేశారు. గత మాసంలో నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో మరో రూ.25 లక్షలు మంజూరు చేయాలని గ్రామస్థులు ఎంపీని కోరారు. దీంతో ఆయన ఆదివారం మచిలీపట్నంలోని తన కార్యాలయంలో కాపు నేతలకు మంజూరు పత్రాన్ని అందజేశారు.

టీడీపీ యువనేత హర్షకు ఘన నివాళి

ఉంగుటూరు, డిసెంబరు 31 : తెలుగుదేశం పార్టీ యువనాయకుడిగా ఇందుపల్లిలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, పార్టీ క్రియాశీలక రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, రాజకీయంగా అంచెలంచెలుగా ఎదుగుతున్న తరుణంలో నర్రా హర్ష ఆకస్మికంగా మృతి చెందటం పార్టీకి, యూత్ కేడర్‌కు తీరని లోటని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు అన్నారు. మండలంలోని ఇందుపల్లిలో ఆదివారం జరిగిన నర్రా హర్ష దశదినకర్మ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొని హర్ష చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. షైనర్ (నర్రా వెంకటేశ్వరరావు)వారసుడిగా హర్ష చేసిన పలు సేవా కార్యక్రమాల గురించి కొనియాడారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు వున్న హర్ష అతి చిన్న వయసులోనే కుటుంబానికి దూరమవటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు అరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆళ్ల హనోక్, నాయకులు కాసన్నేని రాజా, వెనిగళ్ల రాంబాబు, పోతినేని రామకృష్ణ, పొట్లూరి గోపీచంద్, నూతక్కి బెనర్జీ, చింతా శేఖర్ పాల్గొన్నారు.



హర్ష చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చంద్రబాబు సీఎం కావడం ఖాయం

టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు

పెనమలూరు, డిసెంబరు 31 : రాష్ట్రంలో అణగారిన వర్గాల అభివృద్ధి నిమిత్తం సైకో జగన్‌రెడ్డితో నిత్యం పోరాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టడం ఖాయమని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పేర్కొన్నారు. ఆదివారం కానూరు కామయ్యతోపులో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ఏరకంగానూ సైకో జగన్‌రెడ్డిని ప్రజలు ముఖ్యమంత్రిగా ఊహించుకోలేక పోతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీల్లో కనీసం పదిశాతం హామీలను అమలు చేయని ముఖ్యమంత్రి జగన్ ఒక్కడేనని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ఆగ్రహాన్ని చవిచూచిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్ అప్రతిష్ట మూట కట్టుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలగపూడి వెంట కొండ్రు కోటేశ్వరరావు, నాగలక్ష్మి, టైలర్ దాదా, బొగ్గవరపు డేవిడ్ రాజు పాల్గొన్నారు.



కానూరులో జరిగిన కార్యక్రమంలో వెలగపూడి శంకరబాబు

మహిళలు కన్నెర్ర జేస్తే ప్రభుత్వం కుప్పకూలుతుంది

మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 31 : తెలుగు మహిళలు కన్నెర్ర చేస్తే జగన్‌రెడ్డి ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో కుప్ప కూలిపోతుందని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, టీడీపీ కృష్ణాజిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అన్నారు. మచిలీపట్నం టీడీపీ పార్లమెంటు కార్యాలయం వద్ద జిల్లాస్థాయి తెలుగు మహిళల సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వివిధ మండలాల తెలుగు మహిళలు తరలివచ్చారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, జనవరి మూడోవారంలో ఐదు వేలమంది తెలుగు మహిళలతో జిల్లాస్థాయిలో ర్యాలీ నిర్వహించాలన్నారు. నియోజకవర్గ, మండలస్థాయిలో తెలుగు మహిళలు సమావేశాలు నిర్వహించాలన్నారు. తెలుగు మహిళ టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత మాట్లాడుతూ, ఇటీవల జిల్లాలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై నిరసన ప్రదర్శనలు నిర్వహించడంలో జిల్లా అగ్రగామిగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు, రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి శాయన పుష్పవతి, ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి, రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, జిల్లా తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, ఉపాధ్యక్షురాలు సుధారాణి, పొట్లూరి జ్యోతి, జిల్లా అధికార ప్రతినిధి పాలపర్తి పద్మజ, మైనేని ఇందిర, మల్లంపాటి విజయలక్ష్మి, లంకిశెట్టి నీరజ, బండె కనకదుర్గ, మేడేపల్లి రమాదేవి, తూము పద్మజ, దేవరపల్లి అనిత, వసంతకుమారి, పొట్లూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మానికొండ టీడీపీ నేత కృష్ణబాబు మృతి

ఉంగుటూరు, డిసెంబరు 31 : టీడీపీ సీనియర్ నాయకుడు, మానికొండ టైగర్‌గా పిలువబడే గ్రామ మాజీ సర్పంచ్ గోగినేని కృష్ణబాబు(74) అనారోగ్య సమస్యలతో ఆదివారం సాయంత్రం ఆయన నివాసంలో మృతి చెందారు. మాజీమంత్రి వడ్డేశోభనాద్రీశ్వరరావుకు కృష్ణబాబు స్వయానా చిన బావమరిది, కృష్ణబాబు భార్య కొన్నేళ్ల క్రితం చనిపోయారు. ఆమె కూడా సర్పంచ్‌గా పనిచేశారు. భార్యాభర్తలిద్దరూ గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. కుమార్తె విదేశాల్లో స్థిరపడ్డారు. తెలుగుదేశం పార్టీపట్ల అంకితభావంతో పనిచేస్తూ, గ్రామంలో పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసిన కృష్ణబాబు గ్రామంలో కార్యక్రమాలను విస్తృతం చేయడం ద్వారా పార్టీ అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. గన్నవరం మార్కెట్ యార్డ్ మెంబర్‌గా ఆయన రైతులకు ఎనలేని సేవలందించారు. కృష్ణబాబు పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులర్పించిన వారిలో మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్‌బాబు, నాయకులు కాసన్నేని రాజా, అరికట్ల రవి, అన్నే సుబ్బారావు, డాక్టర్ కిలారు శ్రీనివాసరావు, సూరెడ్డి నరేంద్ర, ఎపీఎస్ చైర్మన్ గోగినేని వెంకటేశ్వరరావు తదితరులు వున్నారు. కాగా కృష్ణబాబు అంత్యక్రియలు మంగళవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



కృష్ణబాబు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

నూతన సంవత్సర శుభాకాంక్షలు...





















సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు

గన్నవరం, డిసెంబరు 31 : వైసీపీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. గన్నవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల ధర్నా ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, జగన్‌రెడ్డి మొండి వైఖరి వీడాలన్నారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఇలాంటి మోసకారి సీఎంను ఎన్నడు చూడలేదన్నారు. మహిళలు రోడ్డెక్కి తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతుంటే పట్టించుకోకపోవటం దుర్మార్గమన్నారు. సాంబ, శాంతకుమారి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 31 : రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతా శేషకుమార్, చెన్నుబోయిన శివనాగరాజు అన్నారు. ఆరుగొలను, కె.సీతారాంపురంలో క్రైస్తవులకు టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు పంపిన చీరలు, కానుకను ఆదివారం అందజేశారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విధంగా టీడీపీకి మద్దతు పలకాలని ప్రజలను కోరారు. ఆరుగొలనులో గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతా శేషకుమార్, అన్నే అనిల్‌కుమార్, మూల్పూరి వెంకటరత్నం, తుమ్మల బ్రహ్మాజీ, రావులపాటి భాను కుమార్, చోడెబోయిన రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. కె.సీతారాంపురంలో అధ్యక్షుడు చెన్నుబోయిన శివనాగరాజు, ప్రొద్దుటూరి గంగరాజు, చౌటపల్లి చిరంజీవి, మరియదాసు, భాగ్యరాజు, సొదిమెళ్ల రాజశేఖర్, గాలంకి కిరణ్‌బాబు, కాంద్రు అజయ్, పాల్గొన్నారు.

వీకేఆర్ పూర్వ విద్యార్థుల సమావేశం 7న

గన్నవరం, డిసెంబరు 29 : వేములపల్లి కోదండ రామయ్య (వీకేఆర్) కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జనవరి 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సెక్రటరీ, డీఎస్పీ ఎన్ఎం మురళీకృష్ణ తెలిపారు. గన్నవరం విమానాశ్రయానికి ఎదురుగా ఉన్న వీకేఆర్ కళాశాల నూతన భవన సముదాయంలో స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ, కళాశాల ఫస్ట్ బ్యాచ్ నుంచి ఇప్పటి వరకూ చదివిన పూర్వ విద్యార్థులందరూ తప్పని సరిగా హాజరు కావాలని కోరారు. అయా బ్యాచ్‌లు చదివిన సమయంలో ఆనాటి గురువులను సత్కరించే అవకాశం, అందరిని కలిసి సౌభాగ్యం కలుగుతుందని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.75

మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

గన్నవరం, డిసెంబరు 31 : అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ కనకారావు తెలిపారు. మండలంలోని సూరంపల్లి, కేసరపల్లి గ్రామాల్లో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం అందటంతో సిబ్బందితో కలసి వెళ్లి ఆదివారం దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను, 30 మద్యం సీసాలను స్వాధీనం పరుచుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రైనీ డీఎస్పీ శ్రీవేద, ఎస్సైలు శ్రీనివాస్, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు కిటకిట

ఉయ్యూరు, డిసెంబరు 31 : నూతన సంవత్సరానికి స్వాగతం పలికే ఏర్పాట్లలో భాగంగా ఆదివారం ఉయ్యూరులో స్వీటు షాపులు, బేకరీలు, బిర్యాని దుఖాణాలు కిటకిటలాడాయి. నూతన సంవత్సర సంబరాలు జరుపుకునేందుకు కేకులు, స్వీట్లు కొనుగోలు చేసేందుకు షాపులకు ఎగబడ్డారు. పట్టణంలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్ల పక్క సైతం స్వీటు, కేక్ షాపులు ఏర్పాటు చేయగా అన్ని చోట్ల రద్దీ కన్పించింది.

జంక్షన్‌లో..

హనుమాన్‌జంక్షన్ : నూతన సంవత్సర వేడుకను పురస్కరించుకొని ఆదివారం హనుమాన్‌జంక్షన్ సెంటర్ రద్దీగా మారింది. పూల దుకాణాలు, రంగులు, పండ్లు, ప్రత్యేక స్వీట్స్ స్టాల్స్‌తో కళకళలాడింది. పండగ వాతావరణంలో సంతరించుకుంది. స్వీట్స్ దుకాణాలు నాలుగు రోడ్ల వెంబడి ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది. నిరుద్యోగ యువత సైతం న్యూ ఇయర్ కేక్‌లను ఏర్పాటు చేశారు. పండ్లు, పూల ధరలు మాత్రం ఆకాశాన్ని అంటాయని పలువురు వాపోయారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నూజివీడు రోడ్డులోని హోసన్నా మందిరం నిర్వాహకులు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. విజయవాడ రోడ్డులోని హనుమాన్‌నగర్ చర్చిలో డేనియల్ పాల్, నూజివీడు రోడ్డులోని కారుణ్య చర్చిలో రవిస్టాలిన్, గుడివాడ రోడ్డులోని జ్యోతి చర్చిలో తంబి ఆధ్వర్యంలో అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

వాకర్స్ అసోసియేషన్

కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఉయ్యూరు, డిసెంబరు 31: ఏజీఅండ్ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సత్తార్, ఉపాధ్యక్షులు బెజ్జంకి బ్రహ్మేశ్వరరావు, ముప్పా శివరామకృష్ణ, కార్యదర్శి వేమూరు శ్రీరామపూర్ణచంద్రరావు, ఉప కార్యదర్శి గండు భానుప్రకాశ్, కోశాధికారి వూర కిషోర్‌కుమార్ చేత అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నూకల వెంకట సాంబశివరావు ప్రమాణ స్వీకారం చేయించారు. వీరితో పాటు 8మంది గౌరవ సలహాదారులు, 4 మంది క్లబ్ సర్వీస్ డైరెక్టర్లు, ముగ్గురు పీఆర్వోలు, మీడియా మిత్ర, 19 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్ కుమార్, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జి వెంకటేశ్వరరావు, రామ సత్యకిషోర్, అబు కలాం తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభా కాంక్షలు తెలియజేశారు.

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఖాయం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు : నూతన సంవత్సరంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయం అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు నగర పంచాయతీ మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ప్రజలందరూ ఆయురా రోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. టీడీపీ బీసీ సాధికార రాష్ట్ర అధ్యక్షుడు జంపన వీర శ్రీనివాస్, కూనపరెడ్డి వాసు, చలపాటి శ్రీను, ఏసు పాల్గొన్నారు.
























2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు... 2024

గుడివాడ : మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా రూ.10 కోట్ల నిధులతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టినట్టు ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. పెద ఎరుకపాడులో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న బహుళ ప్రయోజన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. బాలశౌరి మాట్లాడుతూ, మున్సిపల్ స్థలంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌కు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా బాబ్జీ పేరుపెట్టాలని ఎమ్మెల్యే నాని కోరారన్నారు. పార్లమెంట్ పరిధిలో మండలాల వారీగా కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.



బహుళ ప్రయోజన కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బాలశౌరి



ఎన్టీఆర్ స్టేడియం డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి

రూ.10కోట్లతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం

బాపులపాడు మండలంలో వంగవీటి మోహనరంగా పేరుతో రూ.50 లక్షలలో కమ్యూనిటీ హాల్, అవనిగడ్డ నియోజకవర్గంలో ఎదురుమొండి గ్రామంలో రూ.65 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌కు అడపా బాబ్జీ పేరు పెట్టేలా మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయిస్తానని ఎమ్మెల్యే నాని హామి ఇచ్చారు. మున్సిపల్ అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడపా బాబ్జీ మున్సిపల్ పార్కు ప్రారంభం

పెద ఎరుకపాడులో రూ.15 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన అడపా బాబ్జీ మున్సిపల్ పార్కును ఆదివారం ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే నానిలతో కలిసి బాబ్జీ కుమార్తె సాయి శ్రావణి ప్రారంభించారు. తొలుత వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలశౌరి మాట్లాడుతూ మంచితనంతో రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించుకున్న అడపా బాబ్జీ భౌతికంగా మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ పార్కులో డిజిటల్ లైబ్రరీని, యోగా శిక్షణకు కోచ్‌ను నియమిస్తామని హామి యిచ్చారు. మున్సిపల్ అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం డైరీ ఆవిష్కరణ

గుడివాడ : ఎన్టీఆర్ స్టేడియం నూతన సంవత్సర డైరీని ఆదివారం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి నాని ఆవిష్కరించారు. పెద ఎరుకపాడులో పలు కార్యక్రమాలకు హాజరైన సందర్భంతో ఎంపీ డైరీ ఆవిష్కరించారు. స్టేడియం కమిటీ జీవితకాల సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



















చంటి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మండలి బుద్ధప్రసాద్, కొనకళ్ల బుల్లయ్య

చంటి మృతి టీడీపీకి తీరని లోటు : బుద్ధప్రసాద్

చల్లపల్లి, డిసెంబరు 31 : చల్లపల్లి మండల టీడీపీ ఉపాధ్యక్షుడు గోవాడ చంటి మరణం అత్యంత విషాదకరమని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, టీడీపీ రాష్ట్ర నాయకులు కొనకళ్ల బుల్లయ్య అన్నారు. బస్టాండ్ సెంటర్‌లోని చంటి స్వగృహంలో జరిగిన దశదిన ఖర్మ, సంతాప కార్యక్రమానికి వచ్చిన వారు చంటి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. చంటి మరణం పార్టీకి తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మోర్ల రాంబాబు, నిడమానూరి దిలీప్ కుమార్, గువ్వాబత్తిన నాగేశ్వరరావు, షేక్ నబీ ఘోరి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కపిళేశ్వరపురం (పమిడిముక్కల), డిసెంబరు 31 : ఇంటర్నేషనల్ లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు ఎల్విన్ జయంతిని పురస్కరించుకుని కపిళేశ్వరపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఆదివారం క్లబ్ కార్యదర్శి తుమ్మల వెంకట గంగాధరరావు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రవాసాంధ్రులు డాక్టర్ మాధవి సహకారంతో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు క్లబ్ ట్రెజరర్ చిగురుపాటి జగదీశ్ పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడు కడియాల ప్రకాశరావు, తుమ్మల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. గ్రామంలో ఏకాత్మ గోశాల పేరుతో సేవాసంస్థ ఏర్పాటు చేస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి గంగాధరరావు ప్రకటించారు.



గోదాదేవికి సారె సమర్పణ

చల్లపల్లి : శ్రీ ఆర్యవైశ్య సంఘ భవనంనందు ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారికి సారె సమర్పించారు. చల్లపల్లి పురవీధులలో సారెను ఊరేగించి అనంతరం గీతా మందిరంలో గోదాదేవి అమ్మవారికి నివేదన చేశారు. మహిళా భక్తులు, వరదా నాగమణి, కొల్లిపర నళిని, కొల్లిపర ప్రమీల, జ్యోతి, ప్రమీద తదితరులు పాల్గొన్నారు. ఆర్య వైశ్య సంఘం సెక్రటరీ వరదా హరిగోపాల్, ట్రెజరర్ తమ్మన సతీష్, సభ్యులు కిరణ్, నరేంద్ర, సాంబశివరావు తదితరులు పర్యవేక్షించారు.



బాబూరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

మొవ్వ అభివృద్ధిలో బాబురావు సేవలు చిరస్మరణీయం

కూచిపూడి, డిసెంబరు 31 : ప్రవాస భారతీయులు స్వర్గీయ మండవ బాబూరావు మొవ్వ గ్రామాభివృద్ధికి ఇతోధికంగా సేవలందించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. బాబురావు ఎనిమిదో వర్ధంతిని మొవ్వలో నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాతినేని పూర్ణచంద్రరావు, మండవ రామ్మోహనరావు, మండవ కోటేశ్వరరావు, ఈడే నాగబాబు, మండవ సుబ్బారావు, సంకుల గోపి, వేములపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ బల్లల వితరణ

అవనిగడ్డ రూరల్ : శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు తండ్రి తోట చక్రపాణి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు రూ.20 వేల విలువ గల ఐదు సిమెంట్ బల్లలను అవనిగడ్డ గ్రామంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. తోట శ్యామ్ కృష్ణ, గుడివాక శేషుబాబు, యలవర్తి నాంచారయ్య, మోపిదేవికోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.















మాజీ సర్పంచ్ నాగేశ్వరరావుకు బుద్ధప్రసాద్ నివాళి



నాగాయలంక : మర్రిపాలెంలో టీడీపీ బలోపేతానికి నాగేశ్వరరావు ఎనలేని కృషి చేశారని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఇటీవల మృతి చెందిన సర్పంచి బండ్రెడ్డి నాగేశ్వరరావు సంతాప సభ ఆదివారం స్వగృహంలో జరిగింది. సర్పంచి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండ్రెడ్డి బోసు, గ్రామ టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కోడూరు : లింగారెడ్డిపాలెం ప్రాథమ వ్యవసాయ సహకార పరపతి సంఘం ఖాతాదారుడు బండే సాంబశివరావు (శివ) ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు పీఏసీఎస్ ఛైర్మన్ చిట్టిప్రోలు బ్రహ్మారావు రూ.10 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. కడవకొల్లు శ్రీనివాసరావు, బండే నాగరాజు, తోట చంద్రశేఖర్, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ


కృష్ణాపురం (పమిడిముక్కల), డిసెంబరు 31 : కృష్ణాపురం కొత్త ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యలమర్రు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ వరుణకుమార్ ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు ఆదివారం అందజేశారు. క్రమశిక్షణతో కష్టపడి చదవడం అలవరుచుకుని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. కొండవీటి బాబు, యోబు, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానుల పేరుతో జగన్ మోసం : టీడీపీ

కోడూరు : సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక హోదా తీసుకురాకపోగా, మూడు రాజధానుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం మండల పరిధిలోని విశ్వనాథపల్లిలో జరిగింది. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.











2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు 2024

కలెక్టర్, పలువురు ప్రముఖుల నూతన సంవత్సర శుభాకాంక్షలు

మచిలీపట్నం,డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : :జిల్లా ప్రజలు నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో విలసిల్లాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆరోగ్యకరమైన వాతావరణంతో ప్రజలు నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఆయన కోరారు.

టీడీపీ, జనసేన నేతల శుభాకాంక్షలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 31 :నూతన సంవత్సరం- 2024లో ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, టీడీపీ కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, టీడీపీ రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎంపిక



మచిలీపట్నం టౌన్, డిసెంబరు 31 : కృష్ణా జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడుగా సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా ఇ.వి. రామారావు ఎన్నిక య్యారు. మచిలీపట్నం ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగప్రసాద్ ఎన్నికలు నిర్వహించారు. పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం రిటైరయిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలి

● పంటలకు మద్దతు ధర కల్పించాలి ● రైతులకు రుణమాఫీ చేయాలి : మల్నీడు డిమాండ్



రైతుసంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మల్నీడు యలమందరావు

చల్లపల్లి, డిసెంబరు 31 : స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలుచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్నీడు యలమందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యలమందరావు మాట్లాడుతూ, రైతాంగ సమస్యలను పరిష్కరిస్తామని, రైతులను లక్షాధికారులను చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవటం లేదని విమర్శించారు. రైతాంగం అనేక ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి దేశంలో నెలకొందన్నారు. అందరికీ అన్నంపెట్టే రైతు అనాథగా మిగిలే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఎలాంటి మేలు చేయడం లేదని దుయ్యబట్టారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. దేశంలోని అన్ని రకాల పంటలకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సేవ చేస్తామని అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ కార్పొరేట్లు అయిన అంబానీ, ఆదానీ సేవలో తరిస్తున్నాడని విమర్శించారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత లక్ష మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి రైతులంతా పార్టీలకతీతంగా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో రైతు వ్యతిరేక బీజేపీ, దానికి మద్దతుగా ఉన్న ఇతర పార్టీలను గద్దె దింపేందుకు జనవరి ఒకటో తేదీన విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 18వ రాష్ట్ర మహాసభలు జనవరి 8, 9, 10 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించనున్నట్లు వివరించారు. మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా యలమందరావు పిలుపునిచ్చారు.

రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి గుత్తికొండ రాము, జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మ చిన్న కొండయ్య, కాట్రగడ్డ రామచంద్ర జోషి, కోదాటి నారాయణరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ సమ్మాన్ యోజనలో చేనేత వృత్తిని చేర్చాలి



పురందేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న వీవర్స్ ఫెడరేషన్ నాయకులు ఆనందప్రసాద్, పల్లపురాజు

పెడన, డిసెంబరు 31 : చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి విజయవాడలో వినతిపత్రం సమర్పించారు. చేనేత సమస్యలను ప్రస్తావించడంతో పాటు వాటి పరిష్కార మార్గాలను కూడా వినతిపత్రంలో వారు సూచించారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ సమ్మాన్ యోజనలో చేనేత వృత్తిని కూడా చేర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. చేనేత సమస్యలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని పురందేశ్వరి ఈ సందర్భంగా వీవర్స్ ఫెడరేషన్ నాయకులకు హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసా పల్లపురాజు తదితరులు ఉన్నారు.

పైడమ్మ సంబరానికి పోటెత్తిన భక్తులు



శిడిబండి ఊరేగింపు

పెడన, డిసెంబరు 31 : పెడన పైడమ్మ సంబరానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఉత్సవ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కొత్తపేటలోని అమ్మవారి ఆలయానికి వెళ్లే దారులన్నీ కిటకిటలాడాయి. శిడిబండ్లను వైభవంగా ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, వీరంగ విన్యాసాలు, ఆకట్టుకున్నాయి. శిడిబండ్ల ఊరేగింపు సందర్భంగా ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో పోలీసులు విఫలమయ్యారు. ఈవో తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు ఆలయం వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు తోట సాం బశివరావు, శ్రీకాకుళపు సుబ్బారావు, సిరివెళ్ళ వెంకట సూర్యనారాయణ, చిల్లిముంత శ్రీనివాసరావు క్యూలైన్లను పర్యవేక్షించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ఆదివారం పైడమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త వాసు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. పైడమ్మ సంబరాలు ఆదివారం 6వ రోజుకు చేరుకున్నాయి. మరో ఐదు రోజుల పాటు సంబరాలు జరగనున్నాయి.

రంగవల్లులతో నూతన సంవత్సరానికి స్వాగతం



పామర్రు, డిసెంబరు 31 : నూతన సంవత్సరానికి గ్రామగ్రామాన స్వాగతం పలికారు. గ్రామాల్లో గృహిణిలు, యువతులు కోటిఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగవల్లులను తీర్చిదిద్దారు. చిన్నారులు గొబ్బిళ్లు పెట్టి సందడి చేశారు. ఫైర్‌స్టేషన్ సమీపంలోని నెరుసువారి వీధిలో గృహిణి నెమలి ఆకృతిలో తీర్చిదిద్దిన రంగవల్లులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదివారం అర్ధరాత్రి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శుభకర్ ఆదేశాల మేరకు ఎస్సై ప్రవీణ్ కుమార్‌రెడ్డి గట్టి



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో మోపిదేవి పోలీసులు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను చూపుతున్న సీఐ నాగప్రసాద్, చిత్రంలో ఘంటసాల ఎస్సై శ్రీనివాస్

పోలీసుల తనిఖీలు...అక్రమ మద్యం స్వాధీనం

ఘంటసాలలో 115 మద్యం సీసాలు

ఘంటసాల, డిసెంబరు 31 : బెల్టుషాపులపై ఘంటసాల పోలీసులు దాడి చేసి 115 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సిహెచ్.నాగప్రసాద్ ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఘంటసాలలో బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద 115 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారం రోజుల వ్యవధిలో మోపిదేవి, చల్లపల్లి మండలాల్లో బెల్టుషాపులపై దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేసి వారి 49 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. చల్లపల్లి సర్కిల్ పరిధిలో ఎలాంటి సాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై కె.శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేమాలవారిపాలెంలో...

నాగాయలంక : నాగాయలంకలోని రేమాలవారిపాలెం వంతెన వద్ద వాహనాల తనిఖీ సందర్భంగా పెద్ద గౌడపాలెం గ్రామానికి చెందిన పులి నాగ శ్రీను దగ్గరగా అక్రమంగా ఉన్న 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

31సీపీ05 : స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, వ్యక్తులను చూపుతున్న పోలీసులు

వెంకటాపురం, పెదకళ్లేపల్లిలో..

మోపిదేవి : అక్రమంగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 28 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వై.వి.వి.సత్యనారాయణ తెలిపారు. వెంకటాపురం, పెదకళ్లేపల్లి గ్రామాల్లో అనుమతి లేకుండా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.3970 విలువ గల మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

కోడూరు : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని కోడూరు ఎస్సై వి.రాజేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. నూతన సంవత్సర సందర్భాన్ని పురస్కరించుకుని యువకులు కోడూరు ప్రధాన రహదారులు వెంబడి వాహనాలు వేగంగా నడుపుతూ సైలెన్సర్లు తీసి వేసి అల్లర్లకు పాల్పడరాదని తెలిపారు. కోడూరు ప్రధాన కూడళ్లలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

● స్పందించి సేవలందించిన కుమార్ రాజా



పామర్రు, డిసెంబరు 31 : పామర్రు-గుడివాడ ప్రధాన రహదారిపై అడ్డాడ గ్రామంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. మద్యం మత్తులో బైక్ నడుపుతూ స్పీడ్ బ్రేకర్ సమీపంలో మరో బైకును ఢీకొట్టి కిందపడడంతో గాయ పడ్డాడు. బాధితుడిని ఆటుగా వెళ్తున్న పామర్రు నియోజక వర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా గమనించి అంబులెన్స్‌కు సమాచారం అందించి చికిత్స కోసం అతడిని ఆసుపత్రికి తరలించారు. పలువురు టీడీపీ నాయకులు సేవలందించారు.

ప్రభుత్వ బెదిరింపులకు తలొగ్గేదే లేదు



పామర్రు : ప్రభుత్వ బెదిరింపులకు లొంగేది లేదని అంగన్వాడీ సంఘం అధ్యక్షురాలు కొడాలి ఉమారాణి స్పష్టం చేశారు. సమస్యల పరిష్కరం సాధన కోసం పామర్రులో అంగన్వాడీలు చేస్తున్న ఆందోళన ఆదివారం 20రోజుకు చేరింది. ఉమారాణి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల విధులకు హాజరుకాని కార్యకర్తలను జనవరి ఒకటో తేదీ నుంచి శాశ్వతంగా తొలగిస్తామంటూ ప్రభుత్వం బెదిరించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ తలొగ్గేదే లేదని స్పష్టం చేశారు. యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకె నరేంద్ర, ఉపాధ్యాయ సంఘ నేతలు అంగన్వాడీల పోరుకు సంఘీభావం తెలిపారు. ఈకార్యక్రమంలో పద్మ, రత్నశ్రీ, చిన్నారి, రాజేశ్వరి, ఒడుగు గంగాధర్, ముళ్లపూడి విల్సన్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కేడీసీసీబీ విస్తృత సేవలు

● చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి

మచిలీపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : విస్తృత సేవలు అందిస్తూ రైతులకు అండగా ఉంటున్నామని కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. కేడీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేడీసీసీబీ రూ.10,900 కోట్ల టర్నోవరుతో దేశంలోనే సహకార బ్యాంకులలో ఐదో స్థానంలో నిలిచిందన్నారు. రానున్న రోజుల్లో మరింతగా వ్యాపారాన్ని పెంచేందుకు బ్యాంకు అధికారుల సహకారంతో తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కేడీసీసీబీ 425 సహకార సంఘాలు, 57 బ్రాంచ్‌లతో కొనసాగుతోందన్నారు. సహకార సంఘాలకు సొంతభవనాలు సమకూర్చేందుకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోన్ని సహకార సంఘాల్లో రైతుల సౌకర్యార్థం లాకర్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నామని తెలిపారు. జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మాణం చేసుకునే డ్వాక్రా మహిళలకు రెండు లక్షల రూపాయల వరకు కేడీసీసీబీ ద్వారా రుణాలు మంజూరుచేస్తున్నట్లు తెలిపారు. కైకలూరు జగనన్న కాలనీని దత్తత తీసుకుని ప్రయోగాత్మకంగా కేడీసీసీబీ 200 గృహాలకు రుణాలు మంజూరు చేశామన్నారు. కేడీసీసీబీ సీఈవో శ్యామ్‌మనోహర్, డైరెక్టర్లు గడిదేశి పెదవెంకయ్య, సుజాత, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.80

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో అడ్వకేట్ జనరల్ శ్రీరామ్

మోపిదేవి, డిసెంబరు 31 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవాలయాన్ని ఏపీ ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ సుబ్రహ్మణ్య శ్రీరామ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారికి విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో శ్రీరామ్ కుటుంబసభ్యులను సత్కరించారు. ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు వారికి అందజేశారు

రానున్న ఎన్నికలు నియంత పాలనకు చరమగీతం కావాలి

అవనిగడ్డ : రానున్న ఎన్నికలు రాష్ట్రంలోని నియంత పాలనకు చరమగీతం కావాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, ఘంటసాల రాజమోహనరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుద్ధప్రసాద్ ఆవిష్కరించి కార్యకర్తలకు అందజేశారు. గురజాడ(పమిడిముక్కల) : గురజాడలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో కుమార్‌రాజా పాల్గొన్నారు. నిర్వహించారు. శ్రీధర్, పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి కొండ్రు అంజయ్య, జనసేన పార్టీ నాకులు, తెలుగు మహిళా, తెలుగుయువత నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు వెనిగండ్ల ఆర్థిక సహాయం

గుడివాడ : కరోనా సమయంలో నిధులు నిర్వహిస్తూ మృతి చెందిన ముగ్గురు కార్మిక కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అందజేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరంలో ఈ మొత్తాన్ని ఆయన అందజేశారు. కార్మిక సంఘాల నాయకులు వెనిగండ్లకు ధన్యవాదాలు తెలిపారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, నాయకులు రాంబాబు, మురళీ, సునీల్‌కుమార్, సాంబయ్య, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.











